క్లుప్తంగా

లచ్చన్నపాలెంలో వైభవంగా హోమాలు


హోమాల్లో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం: హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక హోమాలు, పూజలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం హనుమాన్ జయంతి కావడంతో లచ్చన్నపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ హోమంలో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జయంతి సందర్భంగా నేటి మధ్యాహ్నం అన్న సమారాధన, రాత్రికి హనుమాన్ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

200 రోజుల ఉపాధి పనులు కల్పించాలి


చౌడువాడలో వేతనదారులతో మాట్లాడుతున్న నాయినిబాబు

కె.కోటపాడు: ఉపాధి వేతనదారులకు ఏటా 200 రోజులపాటు పని కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయినిబాబు డిమాండ్ చేశారు. ఉపాధి వేతనదారులతో శనివారం చౌడువాడలో ఆయన మాట్లాడారు. ఉపాధి పనులకు హాజరయ్యే వారికి రోజు కూలి రూ.400 అందించాలని కోరారు. రోజూ రెండు పూటలా కాకుండా ఉదయం మాత్రమే ఉపాధి పనులు చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు. వేతనదారులకు ప్రతివారానికి పే స్లిప్‌లను ఇవ్వాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు పాల్గొన్నారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు

నాతవరం: స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం మహిళలతో కోలాటం, భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

నేడు వి.వి. అగ్రహారంలో..

మాడుగుల రూరల్: వి.వి.అగ్రహారం అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు దంటు గంగాధరశర్మ శనివారం తెలిపారు. అభయాంజనేయ యూత్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

- స్వామివారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం

మాడుగుల: స్థానిక గాంధీపార్కు వద్ద విజయాంజనేయ జయంతి ఉత్సవాలు ఆదివారం జరగనున్నాయని, ఇందుకు సంబంధించి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని నిర్వాహకుడు రాఖీ శ్రీను తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మారుతి భక్తి రంజని, గాజువాక వారిచే 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా సంకీర్తన కార్యక్రమం జరుగుతుందన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శనివారం సాయంకాలం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఇక్కడ ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. చీడికాడ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రావికమతం: హనుమజ్జయంతి సందర్భంగా పలు గ్రామాల్లో ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రావికమతం, మేడివాడ, చినపాచిల, తట్టబంద, తోటకూరపాలెం, కన్నంపేట, దొండపూడి, మత్రివలస, మరుపాక తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజాధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

అనకాపల్లిటౌన్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్ బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌ల్లో చేరేందుకు ఈనెల 26వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ప్ర'జల జీవన'మే లక్ష్యం

- నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు
- రూ.63 కోట్లతో ఇంటింటికీ కుళాయి పనులు
- 27,379 ఇళ్లకు నీటి సరఫరాకు ప్రణాళిక

నాతవరం: వేసవి వచ్చిందంటే చాలు.. గుక్కెడు నీటి కోసం మహిళలు పడరాని పాట్లు పడుతుంటారు. ఇకనుంచి వీరు ఇంటి బయటకు వెళ్లి నీళ్లు తెచ్చుకునే పరిస్థితి ఉండదు. జల్‌జీవన్‌ మిషన్‌లో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు నేరుగా వారి ఇంటికే కుళాయి ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.63.16 కోట్లతో 314 పనులు చేపట్టారు. ఈ నిధులతో నాలుగు మండలాల్లో 27,379 ఇళ్లకు కుళాయిల ఏర్పాటుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇంతవరకు 19,751 మంది ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేశారు. మిగతావి పలు గ్రామాల్లో వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం ఇంతవరకు 53 పనులు పూర్తి చేయగా, 153 పనులు వివిధ దశల్లో చేస్తున్నారు. చేసిన పనులకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రూ.10 కోట్ల వరకు బిల్లులు చెల్లింపులు చేశారు. వాటిలో పది పనులు స్థలం సమస్య కారణంగా, మరో ఆరు పనులు కాంట్రాక్టరు సాంకేతిక సమస్య కారణంగా ప్రారంభించలేదు. తాగునీటి ఇబ్బందులు పడే గ్రామాల్లో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కృషితో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ఇంటి వద్దే కుళాయి తాగునీరు పట్టుకుంటున్న వృద్ధురాలు

గడప గడపకు నిధులతో 120 పనులు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ పర్యటించి గ్రామాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు రూ.3.85 కోట్లు మంజూరయ్యాయి. ఈ

నియోజకవర్గంలో మండలాల వారీగా ఇంటింటికీ కుళాయిల వివరాలు

మండలం పేరు	పనులు	నిధులు
నాతవరం	97	రూ.27.17 కోట్లు
నర్సీపట్నం	43	రూ.10.12 కోట్లు
గొలుగొండ	88	రూ.10.39 కోట్లు
మాకవరపాలెం	86	రూ.15.59 కోట్లు

నిధులతో నాలుగు మండలాల్లో తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న గ్రామాల్లో స్థానికులు అభీష్టం మేరకు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం 105 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 15 పనులు ఇంకా ప్రారంభం కాలేదు. అవి కూడా సకాలంలో పూర్తి చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రణాళిక రూపొందించారు.

రూ.20 కోట్లతో 412 పనులకు ప్రతిపాదనలు

ఇటీవల నియోజకవర్గానికి విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే గణేష్ పలు సమస్యలు తీసుకెళ్లారు. వీటి పరిష్కారానికి నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించాలని సీఎం కార్యాలయం నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు ఆదేశాలు వచ్చాయి. డ్రైనేజీలు, సీసీరోడ్లు, తాగునీటి వసతి, తదితర వాటికి సంబంధించి 412 పనులకుగాను రూ.20 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. వీటిలో నాతవరం - 176, గొలుగొండ -93, నర్సీపట్నం -59, మాకవరపాలెం - 84 పనులు ఉన్నాయి. అవి త్వరలో మంజూరైతే ఏళ్ల తరబడి వెంటాడే సమస్యలు పరిష్కారం కానున్నాయి.

తాండవ నిర్వాసిత గ్రామాలకు తీరనున్న నీటి సమస్య

తాండవ రిజర్వాయరు నిర్వాసితులు ఉంటున్న మాధవనగరం, గంటావారి కొత్తగూడెంతోపాటు పలు గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.4.23 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో పైలట్ ప్రాజెక్టు నిర్మించి శాశ్వతంగా తాగునీటి సమస్య తీర్చనున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ టెండర్ల ప్రక్రియకు సిద్ధం చేసింది. కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి నడయాడిన సుందరకోట, అసనగిరి గిరిజన గ్రామాల్లో తాగునీటి కోసం రూ.39 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో తాగునీటి పథకం ట్యాంకు నిర్మించి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయనున్నారు.


కుళాయిల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్లూఎస్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు

తాగునీటి సమస్య లేకుండా చేస్తాం



వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నాం. నియోజకవర్గంలో జల్‌జీవన్ మిషన్‌లో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. పలు గ్రామాల్లో మంజూరైన నిధులకు టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. పలు గ్రామాల్లో శాశ్వతంగా తాగునీటి సమస్యకు ఎమ్మెల్యే గణేష్ సూచనలతో ప్రణాళిక సిద్ధం చేశాం.

– పి.ప్రభాకరరావు, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, నర్సీపట్నం

ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

మాడుగుల రూరల్: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టంలో భాగంగా ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో బి. దేముడమ్మ శనివారం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఐబీఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్ అమలు చేస్తున్న పాఠశాలల్లో 25 శాతం సీట్లకు సంబంధించి రెండో విడతలో ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ట్రోల్ ఫ్రీ నంబరు 14417 కు ఫోన్ చేయాలన్నారు. హెచ్ఐవీ బాధిత, అనాథ పిల్లలకు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాలు వారికి (బీసీ, మైనార్టీ, ఓసీ) 6 శాతం సీట్లు రిజర్వ్ చేశారన్నారు.

వేడుకగా నగర సంకీర్తన


వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మాకవరపాలెం: వేంకటేశ్వరస్వామి నగర సంకీర్తనను భక్తులు వేడుకగా నిర్వహించారు. తామరంలో వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మాకవరపాలెం నుంచి ఆలయం వరకు ఈ కార్యక్రమం చేపట్టారు. గోవిందుడి చిత్రపటంతో భక్తిగీతాలు ఆలపించుకుంటూ నగర సంకీర్తన చేశారు. అనంతరం ఆలయంలో అన్నమయ్య కీర్తనలు, ప్రత్యేక పూజలు చేశారు. దీంతో గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది.

వేసవి విజ్ఞాన శిబిరాలకు విశేష స్పందన


నృత్య శిక్షణలో పాల్గొన్న బాలికలు

మాకవరపాలెం: వేసవి విజ్ఞాన శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో గౌతమి లలితకళా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ ఇస్తున్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. ఈ రెండు చోట్లా విద్యార్థులు యోగా, కరాటే, చెస్, నాటికలు, స్పోకెన్ ఇంగ్లిష్, నృత్యం, గణితం వంటి వాటిలో శిక్షణ పొందుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగే ఈ శిక్షణకు విశేష స్పందన లభిస్తోంది.


చౌడువాడలో యోగా తరగతులను పర్యవేక్షిస్తున్న గ్రంథపాలకురాలు పద్మావతి

- యోగా తరగతులు

కె.కోటపాడు: వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి మరింత మెరుగుపడనుందని గ్రంథపాలకురాలు పద్మావతి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శనివారం చౌడువాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా తరగతులను నిర్వహించారు. యోగాతో మానసిక స్థైర్యాన్ని పెంచుకోవడంతోపాటు ఏకాగ్రత కలగనున్నట్లు ఆమె తెలిపారు.

ప్రజా సంక్షేమమే సీఎం ధ్యేయం

చిన అప్పనపాలెంలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విప్ కరణం ధర్మశ్రీ


చిన అప్పనపాలెంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: ప్రజలు ఆర్థిక ఇబ్బందులు, అవస్థలు పడకుండా ప్రజారంజకమైన పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. శనివారం చిన అప్పనపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిపాలన విధానం బాగుందని, అవినీతికి తావు లేకుండా నేరుగా సంక్షేమ పథకాల నగదును బ్యాంక్ ఖాతాలో జమ చేయడంతో లబ్ధిదారుకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని పలువురు గ్రామస్తులు ప్రభుత్వ విప్ ధర్మశ్రీతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. గత టీడీపీ పాలన కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, అమ్మ ఒడి, పాఠశాలల్లో నాడు – నేడు, ఆరోగ్యశ్రీ, గ్రామ సచివాలయ వ్యవస్థతోపాటు పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు బాగున్నాయని సంతోషంగా ఉంటున్నామని వివరించారు. గ్రామంలో బీసీ, ఎస్సీ కాలనీ నుంచి కోవెల ఈశ్వరరావు ఇంటి వరకు డ్రైనేజీ, చల్లా అప్పారావు ఇంటి నుంచి పంట కాలువ వరకు డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, తూము కాలువకు రోడ్డు ఏర్పాటు చేయాలని, పంచాయతీ ఆఫీసు నుంచి చాకలివారి దొడ్డి వరకు గతంలో నిర్మించిన డ్రైనేజీ దెబ్బతిందని, తిరిగి మరమ్మతులు చేపట్టాలని విప్ ధర్మశ్రీ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామస్తులు సూచించిన సమస్యలపై అంచనాలు తయారు చేసి పనులు చేపట్టాలని విప్ ధర్మశ్రీ మండల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణ మూర్తి, గొంపా చినబాబు, సర్పంచ్ కోవెల నాగమణి, గ్రామ సచివాలయ కన్వీనర్ కోవెల ఈశ్వరరావు, నాయకులు దొండా అచ్చియ్యదొర, పెదిరెడ్డి కృష్ణారావు, పెంట్రెడ్డి సంతోషిని, బత్తుల జయమ్మ, కె.వరలక్ష్మి, అలమండ చెల్లయమ్మ పాల్గొన్నారు.


మెయిన్ రోడ్డులో డ్రైనేజీ ఏర్పాటును పరిశీలిస్తున్న విప్ ధర్మశ్రీ

కొడుకు కడసారి చూపునకూ నోచుకోలేదు..

- విషాదం నింపిన రోడ్డు ప్రమాదం
- ఛిన్నాభిన్నమైన పాస్టర్ కుటుంబం
- కాళ్లు చేతులు విరిగి కుటుంబం అంతా ఆస్పత్రిపాలు

నక్కపల్లి: నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం ఆ నిరుపేద కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో కుటుంబం అంతా తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయింది. వీరిలో ఆరేళ్ల కుమారుడు చికిత్స పొందుతూ మరణించగా, మిగిలిన వారు కాళ్ల చేతులు విరిగిపోయి ఆస్పత్రిలో మంచాన పడ్డారు. కన్నకొడుకు చివరి చూపునకు నోచుకోలేని ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. దీనికి తోడు వైద్య ఖర్చులకు ఆర్థిక స్తోమత లేక ఆపన్న హస్తం కోసం ఎదరు చూస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే నక్కపల్లికి, సారిపల్లిపాలేనికి మధ్య ఈనెల 10తేదీన ఐషర్ వ్యాన్ ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఆటో వెనుక బైక్‌పై వెళ్తున్న నక్కపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు, పాస్టర్ అయిన పెదపాటి కిరణ్ కుటుంబం తీవ్రగాయాల పాలైన విషయం విదితమే. ఈ ఘటనలో కిరణ్ సుధీర్ లాజర్(6) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ 11వ తేదీన మరణించాడు. కిరణ్‌కు కాలు విరిగిపోయింది. అతని భార్య భారతికి రెండు చేతులు, కాలు విరిగిపోయింది. కుమార్తె శ్రుతికి కాలు విరిగిపోయింది. వీరంతా సిమెంట్ కట్లతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన కుమారుడు లాజర్ కడసారి చూపునకు తల్లిదండ్రులు నోచుకోలేదు. ఎస్సీ కాలనీలో చిన్నపెంకుటింట్లో నివసిస్తూ పాస్టర్‌గా చిన్నపాటి వైద్య సేవలు అందిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న కిరణ్ కుటుంబం విధి వక్రించి ప్రమాదం బారిన పడడంతో ఆదాయం లేక మందులు కొనుగోలుకూ స్తోమత లేక ఇబ్బంది పడుతున్నట్టు బాధితుడి స్నేహితులు తెలిపారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి కిరణ్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిరణ్


చేతులు, కాలు విరిగిన కిరణ్ భార్య భారతి


ఆస్పత్రిలో కిరణ్ కుమార్తె శృతి

సమస్యలను వెతకండి.. పరిష్కరించండి

చుక్కపల్లిలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చీడికాడ: గ్రామాల్లో సమస్యలను వెతకండి.. వాటి పరిష్కారానికి కృషి చెయ్యండి అంటూ పార్టీ శ్రేణులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శనివారం చుక్కపల్లిలో ఆయన ఇంటింటికీ తిరిగారు. ప్రతి ఇంటా వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు తమ ఆనందం పంచుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అర్హులైన వారు నష్టపోకూడదన్నదే గడప గడపకు మన ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కులం, మతం, పార్టీ, ప్రాంతం, వర్గం అనే తేడా లేకుండా మన జగనన్న సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. నిరుపేదలకు సత్వర న్యాయం అందించడమే తన ఆశయమని సచివాలయం సిబ్బందికి, వలంటీర్లకు సూచించారు. మరుగునీటి కాలువల నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందుకోసం రూ.20 లక్షలు కేటాయించారు. రూ.1.05 కోట్లతో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు, నూతనంగా 40 వేల లీటర్ల మంచి నీటి ట్యాంకు నిర్మించనున్నట్లు తెలిపారు. సాంకేతిక కారణాలతో పింఛన్లు నిలిచిపోయిన తల్లీకూతుళ్లు సుంకర అచ్చియ్యమ్మ, సుంకర ముత్యాలమ్మ, తెలిచినతల్లి, నిరుపేద వృద్ధులు వంకా అచ్చియమ్మ, గజ్జి కొండమ్మల ఆర్థిక పరిస్థితికి చలించిపోయిన బూడి నగదు సాయం చేశారు. అనంతరం నాడు–నేడు పనుల్లో భాగంగా రూ.23.40 లక్షలతో ఎంపీపీ పాఠశాలలో నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. చుక్కపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి 556 మార్కులు సాధించిన పిల్లా బిందుప్రియను అభినందించారు. జగనన్న ఇళ్ల పథకంలో మంజూరైన 51 ఇళ్లకు సంబంధించి విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ, ఎంపీటీసీ సుంకర వెంకటలక్ష్మి, ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, నాయకులు మజ్జి దేవానంద్, బాయిశెట్టి వెంకటరమణ, సకలా రమణ, సత్తిబాబు, తిరుమలరావు, మాతారావు, పెచ్చేట్టి రాము, అధికారులు పాల్గొన్నారు.


దివ్యాంగ వృద్ధునితో మాట్లాడుతున్న బూడి


పాఠశాల భవనాన్ని ప్రారంభించిన బూడి

కలశస్థాపన మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి


వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పల జయదేవ్, తదితరులు

చోడవరం: ఉత్తరాంధ్ర ఆరాధ్య ఆదిదేవుడైన చోడవరం స్వయంభూ విఘ్నేశ్వర స్వామివారి ఆలయ రాజగోపురం కలశస్థాపన మహోత్సవం జూన్ 4న నిర్వహించనున్నామని ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రతినిధి పప్పల జయదేవ్ తెలిపారు. ఆలయ రాజగోపురం కలశ ప్రతిష్టాపన మహోత్సవం వాల్‌పోస్టర్లను ఆలయన ప్రాంగణంలో శనివారం ఆయన విడుదల చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో పుణ్యక్షేత్రంగా వెలుగొందేలా ఈ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టారు. దీనిలో భాగంగా రూ. 3 కోట్లతో ఆలయానికి తూర్పు రాజగోపురం, పశ్చిమ గాలిగోపురాలను నిర్మించారు. వీటిని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు జయదేవ్ చెప్పారు. వచ్చే నెల 4 నుంచి 7వ తేదీ వరకూ కలశస్థాపన ఉత్సవాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. భారీ ఏర్పాట్లతో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ ఉత్సవాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతిరావు, వెంకట్రావు, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ నున్న నాగేశ్వరరావు, డీఆర్‌యూసీ సభ్యుడు బొడ్డు శ్రీరామ్మూర్తి, కమిటీ సభ్యులు జ్యోతుల శ్రీను, విజయలక్ష్మి, సుబ్బలక్ష్మి, మూర్తి పాల్గొన్నారు.

ఏలేరు కాల్వలో గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం


ఉగ్గినపాలెంలో ఏలేరు కాలువ నుంచి వెలికి తీసిన అప్పారావు(63) మృతదేహం

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం గ్రామం వద్ద ఏలేరు కాలువలో గల్లంతైన వృద్ధుని మృతదేహం శనివారం లభ్యమైనట్టు అదనపు ఎస్ఐ జెక్కుల నాగేశ్వరరావు తెలిపారు. తాళ్లపాలెం గ్రామానికి చెందిన తనకాల అప్పారావు(63) పక్కనున్న ఉగ్గినపాలెం వెళ్లి అక్కడి ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తూ కాలుజారి పడి గల్లంతైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అదే గ్రామం వద్ద ప్రమాద స్థలానికి కొంత దూరంలో మృతదేహం తేలడంతో కాలువ నుంచి వెలికి తీసి పోస్టుమార్టం కోసం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

క్రీడల్లో రాణించడానికి వేసవి శిక్షణ దోహదం

క్రీడా సామగ్రి పంపిణీలో ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: వేసవి శిక్షణ శిబిరాలు క్రీడల్లో రాణించడానికి దోహదపడతాయని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో వేసవి శిక్షణ పొందుతున్న వూషూ, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్ మొత్తం ఆరు రకాల క్రీడలకు సంబంధించి సామగ్రిని జిల్లా స్పోర్ట్స్ సరఫరా చేసింది. ఈ క్రీడా సామాగ్రిని క్యాంపు కార్యాలయంలో క్రీడాకారులకు ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం విద్యతోపాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ద్వారా ప్రత్యేక కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి ఆయా క్రీడల్లో శిక్షణ ఇవ్వటం హర్షణీయమన్నారు. సీఎం కప్ బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్స్ సాధించిన బొంతు మౌనిక, కొలుకుల కృష్ణవేణిలను ఎమ్మెల్యే అభినందించారు. శాప్ కోచ్ అబ్బు, కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ, నింజాస్ అకాడమీ డైరెక్టర్ వెలగా నారాయణరావు, లగుడు శ్రీనివాస్, కోచ్ శేఖర్ పాల్గొన్నారు.


క్రీడాకారులకు సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

మాడుగులలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు

- బాలికల వసతి గృహంలోకి డిగ్రీ కళాశాల
- ఎంపీపీ రామధర్మజ

మాడుగుల: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా మాడుగుల పట్టణంలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎంపీపీ వేమవరపు రామధర్మజ తెలిపారు. శనివారం ఆయన మాడుగులలో మాట్లాడుతూ 17 ఏళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, స్థానిక నాయకుడు వేమవరపు వెంకటరమణ తదితరుల కృషితో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇక్కడ డిగ్రీ కళాశాలతో పాటు భవనాల నిర్మాణానికి రూ. 5 కోట్లు మంజూరు చేశారన్నారు. స్థలాభావ సమస్యతో ఆ నిధులు వెనక్కి పోయాయన్నారు. ఈ నేపథ్యంలో జూనియర్ కళాశాలలోనే ఉదయం ఇంటర్, మధ్యాహ్నం డిగ్రీ విద్యార్థులకు తరగతులు నిర్వహించడం వల్ల ప్రవేశాల సంఖ్య తగ్గిపోతుందన్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి సహాయంతో ఐదెకరాల స్థలం కేటాయించారన్నారు. ఇంకా భవనాలు నిర్మించాల్సి ఉందన్నారు. అంతవరకు స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానంలో రెండేళ్ల క్రితం రూ.1.25 కోట్లతో నిర్మించిన బాలికల వసతి గృహ భవనంలో తాత్కాలికంగా డిగ్రీ కళాశాల తరగతుల నిర్వహణకు అనుమతులు వచ్చాయన్నారు. ఇక నుంచి ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు డిగ్రీ తరగతులు నిర్వహిస్తారన్నారు. రూ.5.65 కోట్లతో ఆస్పత్రి, మోదమాంబ కాలనీలో ఎంపీ నిధులు రూ.35 లక్షలతో కల్యాణ మండపం, రూ.1.50 కోట్లతో పీఆర్ గెస్ట్ హౌస్ నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. కోట్లాది రూపాయలతో చేపట్టిన 21 సీసీ రోడ్ల నిర్మాణంలో 18 రోడ్లు పూర్తయ్యాయన్నారు. డిప్యూటీ సీఎంకు గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పాలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, వార్డు మెంబర్లు వేమన గణేష్, శీలామంతులు జ్యోతి, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలిమేర చిన్నారావు, కరణం రాము, కుక్కర మోదకొండ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ రామధర్మజ తదితరులు